మంచంపట్టిన పల్లెలు

- గ్రామాల్లో విజృంభిస్తున్న డయేరియా, విషజ్వరాలు
- గొల్లపేటలో నలుగురికి డయేరియా
- అప్పన్నదొరపాలెంలో జ్వరాలతో బాధపడుతున్న 24 మంది
- వైద్యసేవలు, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజలు అసంతృప్తి


అప్పన్నదొరపాలెంలో జ్వరంతో మంచం పట్టిన వృద్ధుడు బి.అప్పడు

కొత్తవలస: మండలంలోని పలుగ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండడంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఓవైపు విషజ్వరాలు, టైఫాయిడ్, సాధారణ జ్వరాలు ప్రజలను వణికిస్తుం డగా..మరో వైపు డయేరియా దడపుట్టిస్తోంది. తాజాగా జిల్లాలోని గుర్ల మండలంలో డయేరియాతో 14మంది వరకు చనిపోవడం తో ప్రజలు హడలిపోతున్నారు. మండలంలోని కాటికాపల్లి సచివాలయం పరిధి గొల్లపేట గ్రామంలో డయేరియా కలకలం రేగడంతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డా రు. గ్రామంలో నలుగురు వ్యక్తులు డయేరియా లక్షణాలతో బాధపడుతున్నారు. వీరిలో బొబ్బిలి అప్పలరాజు అనే వ్యక్తి పరిస్థితి విషమంగా ఉండడంతో విశా ఖపట్నం కేజీహెచ్‌కి తరలించారు. చిన్ని రాధ అనే మహిళ బుధవారం రాత్రి నుంచి కొత్తవలస పీహెచ్‌సీలో వైద్యం పొందుతోంది. మరో ఇద్దరు స్థానికంగా వైద్యం చేయించుకుని కోలుకుంటున్నారు. ఇంత జరుగుతున్న గ్రామసమీపంలో ఉన్న హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను మాత్రం అధికారులు తెరవలేదు. అత్యవసర సమయంలో కనీసం ప్రథమ చికిత్సకు అవకాశం లేకుండా తాళాలు వేయడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెల్‌నెస్ సెంటర్ సిబ్బంది ఫీల్డ్‌లో ఉన్నారని సచివాల య సిబ్బంది చెప్పుకొస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణకూడా సరిగా లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.గ్రామంలో డయేరియా కేసులు బయడపడడంతో కాలువల్లో పూడిక, చెత్త తొలగించ కుండానే హడావుడిగా బ్లీచింగ్ ఫౌడర్ చల్లి సరిపెట్టారు.

అల్లాడుతున్న అప్పన్నదొరపాలెం

కొత్తవలస మండలంలోని ఏకైక గిరిజన గ్రామం అప్పన్నదొరపాలెంలో గత నాలుగు రోజులుగా విష జ్వరాలు విజృంభిచడంతో గ్రామస్తులు అల్లాడిపోతున్నారు. గ్రామంలో 24 మంది వర కు వైరల్, టైఫా యిడ్ జ్వరాలతో బాధపడుతున్నారు. చాలామంది మంచంపై నుంచి లేవలేని స్థితిలో ఉన్నారు. ఇంత మంది జ్వర పీడితులు ఉన్నప్పటికీ గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసే ఆలోచన కూడా అధికారులు చేయలేదని, ఆశ వర్కర్లను పంపించి మాత్రలు అందజేసి మమ అనిపిస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ లోపం వల్ల వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాలువలు పూడిక, చెత్తతో నిండిపోయాయని, మూడు నెలలుగా గ్రామంలో తాగునీటి ట్యాంకును శుభ్రం చేయలేదని, తాగునీటి పైపులైన్లు మురుగుకాలువల్లోంచి ఉండడంతో తాగునీరు కలుషితమవుతోందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయడంతో పాటు, పారిశుద్ధ్య పనులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


అప్పన్నదొరపాలెంలో పూడిక, చెత్తతో నిండిన కాలువలో నుంచి ఉన్న తాగునీటి పైపులు


కొత్తవలస పీహెచ్‌సీలో వైద్యం పొందుతున్న గొల్లపేటకు చెందిన డయేరియా బాధితురాలు రాధ


అప్పన్నదొరపాలెంలో విషజ్వరంతో మంచానికే పరిమితమైన కె.దాలమ్మ

ఉప్పొంగిన ప్రజాభిమానం


మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో కరచాలనం చేసేందుకు పోటీ పడుతున్న యువకులు, కార్యకర్తలు

- గుర్ల పర్యటనలో ప్రతిపక్ష నేత జగన్‌కు అడుగడుగునా జననీరాజనం

గుర్ల/మెరకముడిదాం/గరివిడి(చీపురుపల్లి రూరల్): డయేరియాతో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించడానికి గురువారం గుర్ల వచ్చిన ప్రతిపక్ష నేత, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు.గుర్ల మండలంలోని సాలిపిసోమరాజుపేటలో హెలీప్యాడ్ వద్ద జగన్‌మోహన్‌రెడ్డికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. జననేత జగన్‌ని చూసేందుకు అభిమానులు, ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో సాలిపిసోమరాజుపేట నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుర్ల మండల కేంద్రానికి కాన్వాయ్ చేరుకోవడానికి సుమారు గంటన్నర సమయం పట్టింది. రోడ్డుకు ఇరువైపులా యువత, అభిమానులు నిలబడి జగనన్నకు జేజేలు పలికారు. రెండు కిలోమీటర్ల మేర అభిమానులు, కార్యకర్తలు జైజగన్ అంటూ కాన్వాయ్ వెంట పరుగులు తీశారు. కొందరు కార్యకర్తలు బైక్ రాలీ చేశారు. మృతుల కుటుంబ సభ్యులతో ప్రతిపక్ష నేత జగన్ మాట్లాడి వారికి ధైర్యం చెప్పి, భరోసా కల్పించారు. జగన్ వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు, గుర్ల జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ గుర్ల, చీపురుపల్లి మండలాల అధ్యక్షులు జమ్ము స్వామినాయుడు, ఇప్పిలి అనంతం, పార్టీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసరావు, పార్టీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, మెరకముడిదాం మండల నాయకులు తాడ్డి వెంకటరావు, బూర్లె నరేష్ కుమార్, గరివిడి మండల నాయకులు మీసాల విశ్వేశ్వరరావు, గుర్ల నాయకులు ఐ.ప్రసాద్, ఎం.వెంకటరమణ, బోడసింగి అప్పలనాయుడు ఉన్నారు.

క్లుప్తంగా

గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి సహకరించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

కొత్తవలస: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి రైతులు సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమా రి కోరారు.గ్రీన్ ఫీల్డ్ హైవే ఇంటర్‌చేంజ్ పనులకు ఉత్తరాపల్లి రెవెన్యూ పరిధిలో భూములు,ఇళ్లు కోల్పోతున్న వారితో సచివాలయంలో తహసీల్దార్ నీలకంఠరావు అధ్యక్షతన గురువారం సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్వాసితులకు పరిహారం పెంచి ఇప్పించేందుకు తమవంతు కృషి చేస్తానని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొనారు.

కబడ్డీ విజేత చీపురుపల్లి 'ఎస్‌వీఎస్'

విశాఖ స్పోర్ట్స్ : ఏయూ అంతర కళాశాలల మహిళా కబడ్డీ సెలెక్షన్ ట్రయిల్స్ మ్యాచ్‌ల్లో చీపురుపల్లి ఎస్‌వీఎస్ డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్‌లో చీపురుపల్లికే చెందిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టుపై 36 పాయింట్ల తేడాతో (42–8) విజయం సాధించింది. ఏయూ జిమ్నాజియంలో గురువారంతో ముగిసిన ఈ పోటీల్లో మూడో స్థానానికి జరిగిన పోటీల్లో వీజీడీ కళాశాల జట్టు 12–8 పాయింట్లతో తేడాతో సత్యా డిగ్రీ కళాశాల జట్టుపై విజయం సాధించింది. పోటీల ముగింపు కార్యక్రమానికి ఏయూ డీన్ ఆచార్య ధనరాజ్ హాజరై ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూపీఈ విభాగ సంచాలకుడు విజయ్‌మోహన్, నిర్వాహక కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 93 మంది ఎంపిక


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్(జేకేసీ)లో ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ నేతృత్వంలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు మంచి స్పందన వచ్చిందని జేకేసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఈరన్న చెప్పా రు.వేర్వేరు ప్రాంతాల నుంచి 300 మందికిపైగా నిరుద్యోగ యువతీ, యువకులు మేళాకు హాజరు కాగా మెట్రో,జస్ట్ డయ ల్, గ్రాండ్ ఫార్మా, యంగ్ ఇండియా తదితర పది కంపెనీలకు 93 మంది ఎంపికయ్యారని తెలిపారు.కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు మాట్లాడుతూ యువత అందివచ్చిన అవకాశాలను వినియోగించుకుని ముందు ఉద్యోగం సాధించి తర్వాత అంచెలంచెలుగా అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలని సూచించారు. డీపీఓ భాస్కరరావు,ఎస్‌ఈఈడీఏపీ కో–ఆర్డినేటర్ కిశోర్, ఆయా కంపెనీల ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

డాక్టర్ వరలక్ష్మికి గ్లోబల్ పురస్కారం


ఇన్‌స్పైరింగ్ ఉమెన్ పురస్కారం అందుకుంటున్న డాక్టర్ వరలక్ష్మి

శృంగవరపుకోట: స్థానిక కోలపర్తి ఆస్పత్రి, డీ.వి.ఎల్ పబ్లిక్ స్కూల్ వ్యవస్థాపకురాలు డాక్టర్ పి.వరలక్ష్మికి గ్లోబల్ ఉమెన్ పురస్కా రం దక్కింది. న్యూఢిల్లీకి చెందిన షీ ఇన్‌స్పైర్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రపంచ వ్యాప్తంగా వేర్వేరు రంగాల్లో విశేష సేవలందిస్తున్న మహిళలను ఎంపిక చేసి వారికి పురస్కారాలు అందిస్తోంది. ఈనెల17న ఢిల్లీలో నిర్వహించిన ఉమెన్స్ సమ్మిట్–2024కు ఆంధ్రా నుంచి ఎంపికైన ఇద్దరు మహిళల్లో డాక్టర్ వరలక్ష్మి ఒకరు కావడం విశేషం. మద్యం, మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన వారి కి కౌన్సిలింగ్ ఇచ్చి, ఉచితంగా మందులు అందజేయడం, వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందించడం, వారితో చెడు వ్యస నాలు మాన్పించడం కోసం వరలక్ష్మి చేస్తున్న కృషి, పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం చేస్తున్న ఆర్థికసాయం వంటి సేవా కార్యక్రమాలను గుర్తించి, ప్రశంసాపత్రం, జ్ఞాపికలు ఇచ్చిగౌరవించారు.

సకాలంలో తెగుళ్లను గుర్తించాలి


నరవలో రైతులకు సూచనలు చేస్తున్న చంద్రశేఖర్‌బాబు

గంట్యాడ: వరి పంటను ఆశిస్తున్న తెగుళ్లను సకాలంలో గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలని రైతు శిక్షణ కేంద్రం ఏడీ చంద్రశేఖర్‌బాబు రైతులకు సూచించారు. కొఠారుబిల్లి, నరవ గ్రామాల్లో వరి పంటను గురువారం ఆయన పరిశీలించారు. వరి పంటను సుడిదోమ ఆశించినట్లు గుర్తించి, నివారణకు పిచికారీ చేయాల్సిన మందులను సిఫార్సు చేశారు. తుఫాన్ నేపథ్యంలో వర్షాలు కురిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏఓ శ్యామ్‌కుమార్, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

ఓటు హక్కు నమోదుపై అవగాహన


మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణకుమారి

శృంగవరపుకోట: ఓటు హక్కు నమోదుపై స్థానిక చైతన్య డిగ్రీ కళాశాలలో తహసీల్దార్ అరుణకుమారి గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనవరి 2025 నాటికి 18 ఏళ్లు పూర్తికానున్న వారిని ఓటర్లుగా, జనవరి 2025 నాటికి 17 ఏళ్లు నిండిన వారిని ప్రోస్పెక్టివ్ ఓటర్లుగా నమోదు చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిందని చెప్పారు. ఇప్పుడు ప్రోస్పెక్టివ్ ఓటర్లుగా నమోదైన వారికి ఏడాది త ర్వాత ఓటరు ఐడెంటిటీ కార్డులను ఈసీ జారీ చేస్తుందని తెలిపారు.ఓటరు హెల్ప్ లైన్ యాప్ లేదా, నేషనల్ఓటరు సర్వీస్ పోర్టల్ (ఎన్‌వీఎస్ పీ) ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు.లేకుంటే తహ సీల్దార్ కార్యాలయాల్లో, బీఎల్‌ఓల వద్ద ఫారం–6లు అందుబాటులో ఉంటాయని చెప్పారు.ఓటుతో మెరుగై న సమాజాన్ని నిర్మించవచ్చని,18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా చేరాలని విద్యార్థులను కోరారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సునీత, చైతన్య డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు సునీల్, సూర్యారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేపాడ: మండల కేంద్రం వేపాడతో పాటు వల్లంపూడి గ్రామానికి శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగలకు ఆ నుకుని ఉన్న చెట్లకొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

గజపతినగరం సబ్‌స్టేషన్ పరిధిలో..

గజపతినగరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, మెయింటెనెన్స్‌పనులు చేపట్టనునున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుం దని విద్యుత్ శాఖ డీఈ శివకుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గజపతినగరం, పురిటిపెంట, ఎం. వెంకటాపురం, దావాలపేట, బూడిపేట, పట్రువాడ, గంగచోళ్లపెంట, పాతబగ్గాం, కొత్తబగ్గాం, బంగార మ్మపేట, భూదేవిపేట, సాలిపేట, మర్రివలస, కొనిశ, మరుపల్లి, మధుపాడ,ఎం.గుమడాం, తమ్మారాయుడుపేట, డోలపాలెం,కాలంరాజుపేట, కొత్తశ్రీరంగరాజపురం, పాతశ్రీరంగరాజపురం, సీతారామపురం, పిడిశీల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎస్.కోట రూరల్ ఫీడర్‌లో..

శృంగవరపుకోట: ఎస్.కోట రూరల్ ఫీడర్‌లో ఎస్.కోట నుంచి బొడ్డవర వరకు ఉన్న విద్యుత్ లైన్లను ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఈఈ జి.సురేష్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.భవానీనగర్, భర్తాపురం, కొత్తపాలెం, జెడ్.కుమరాం, లచ్చందొరపాలెం, మరుపల్లి, కాపుసోంపురం, మూలబొడ్డవర గ్రామాలకు ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కేజీబీవీ సందర్శన


విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న డీఈఈ పైడిరాజు, ఎంపీడీఓ సూర్యనారాయణ

వేపాడ: బక్కునాయుడుపేటలోని కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని(కేజీబీవీ) ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కె.ఆర్.వి.పైడిరాజు,ఏఈ దేవి, ఎంపీడీఓ సూర్యనారాయణ గురువారం సందర్శించారు. పాఠశాలలో అర్ధంతరంగా నిలిచిపోయిన అదనపు భవనాల నిర్మాణ పనులను పూర్తి చేయాలని సామాజిక కార్యకర్త అప్పారావు కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఇటీవల వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు భవన నిర్మాణాలను అధికారులు పరిశీలించారు. భవన నిర్మాణాలపై నివేదికను కలెక్టరుకు అందజేస్తామని డీఈఈ చెప్పారు. అనంతరం విద్యాలయంలో మధ్యా హ్న భోజన వంటకాలను పరిశీలించి, విద్యార్థినులకు భోజనం వడ్డించారు. కేజీబీవీ ఎస్‌ఓ కిరణ్మయి కి పలు సూచనలు చేశారు.

గిరిజన బాలికల పాఠశాల ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న గిరిజన సంఘం నేతలు

శృంగవరపుకోట: మండల కేంద్రంలో గిరిజన బాలికల పాఠశాల ఏర్పాటు చేయాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పల్ల సురేష్, శివ, రాయుడు తదితరులు డిమాండ్ చేశారు. ఎస్.కోటలో గురువారం వారు మాట్లాడుతూ ఎస్.కోట ప్రాంతంలో గిరిజన బాలుర పా ఠశాల, వసతి గృహాలు ఉన్నాయి కానీ బాలికల పాఠశాల లేదన్నారు. స్థానిక గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, వసతి గృహాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, ప్రహరీలు, సరైన వసతి, బెడ్లు, మైదానం, మౌలిక సౌకర్యాల లేవన్నారు. సిబ్బంది, కొరత వేధిస్తోందన్నారు. కొన్ని వసతి గృహాల్లో వంట, వడ్డన విద్యార్థులే చేస్తున్నారని, ఆరోగ్య సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు.

మండలస్థాయి క్విజ్ పోటీలు


ప్రథమ స్థానం సాధించిన విక్టరీ హైస్కూల్ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం వల్లీ, నిర్వాహకులు

వేపాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విజయనగరానికి చెందిన అబ్దుల్ కలాం సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం మండలస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో 18 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని నిర్వాహకులు పొట్నూరు వరప్రసాద్ మాస్టారు తెలి పారు. వేపాడ విక్టరీ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించగా, వేపాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయస్థానంలో, మోడల్ స్కూ ల్ విద్యార్థులు తృతీయస్థానంలో నిలిచారు. విజేతలకు హెచ్‌ఎం ఎస్.ఎస్.వల్లీ, అబ్దుల్ కలాం సేవా సమితి సభ్యులు బహుమతులు అంద జేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


మెరకముడిదాం: త్రోబాల్, క్రికెట్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో భైరిపురం హైస్కూల్ ఉపాధ్యాయులు


చీపురుపల్లి రూరల్(గరివిడి): ఖోఖో పోటీలకు ఎంపికైన తోండ్రంగి హైస్కూల్ విద్యార్థులు

మెరకముడిదాం: జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ త్రోబాల్, క్రికెట్ పోటీల్లో మండలంలోని భైరిపురం బాదం పెంటయ్య ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని హెచ్‌ఎం ఎం.ఈశ్వరరావు గురు వారం తెలిపారు. అండర్–17 బాలికల విభాగం త్రోబాల్ పోటీల్లో రెడ్డి అనుష్క, అండర్–14 విభా గంలో తోట డిల్లీశ్వరి, అండర్–17బాలుర విభాగం క్రికెట్ పోటీలకు తోండ్రాసి శివ ఎంపికయ్యారు. విద్యార్థులతో పాటు పీడీ జె.నానాజీరావును ఉపాధ్యాయులు అభినందించారు.

ఖోఖో పోటీలకు తోండ్రంగి విద్యార్థులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని తోండ్రంగి ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన బాల, బాలికలు సీహెచ్ భవాని, దేవి, లావణ్య, దివ్యశ్రీ, జాహ్నవి,నానాజీ, హరిప్ర సాద్, యోగేంద్ర, సాయిబాలాజీ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్లలో చోట సాధించారు. ఈనెల 26 నుంచి మూడు రో జుల పాటు చిత్తూరు జిల్లా కానిపాకంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్ల తరఫున వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యా ర్థులను, పీడీ సత్యనారాయణను హెచ్‌ఎం రమేష్ కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.


వేపాడ: వాలీబాల్ పోటీలకు ఎంపికైన హేమశ్రీతో బక్కునాయుడుపేట మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు

వాలీబాల్ జట్టులో హేమశ్రీ

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ ఎంఈసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని సింగంపల్లి హేమశ్రీ అండర్–19 విభాగంలో జిల్లా వాలీ బాల్ జట్టులో చోటు సాధించారు. ఇటీవల జిల్లాకేంద్రంలో నిర్వహించిన స్కూల్ పోటీల్లో విద్యార్థిని హేమశ్రీ సత్తాచాటడంతో రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లాజట్టుకు ఎంపిక చేశారని ప్రిన్సి పాల్ రావాడ ఈశ్వరరావు తెలిపారు. విద్యార్థిని ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ రమణ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్‌వీఈపీ ప్రోగ్రాంపై అవగాహన


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌వీఈపీ ఏపీఎం ఇందిరాదేవి

గజపతినగరం: మహిళలు వ్యాపారాలు నిర్వహించుకుని ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని ఎస్‌వీఈపీ ఏపీఎం ఇందిరాదేవి తెలిపారు. ఎస్‌వీఈపీ(స్టార్టప్ విలేజ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రాం)పై స్థానిక వెలుగు కార్యాలయంలో సీసీలు, వీఓఏలు, ఎంఎస్‌లు, ఓబీలకు గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లా డుతూ వ్యక్తిగతంగా వ్యాపారాల నిర్వహణకు ముందుకు వచ్చే డ్వాక్రా సంఘాల సభ్యులకు ఎస్‌వీఈపీ ప్రాజెక్ట్‌లో భాగంగా రుణసదుపాయం కల్పించనున్నట్లు చెప్పారు. ఎస్‌వీఈపీ ప్రాజెక్టుకు గజపతినగరం క్లస్టర్ పరిధిలో ఆరుమండలాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో వివిధ రకాల వ్యాపారాలు చేసేందుకు ఆసక్తి గల మహిళలను గుర్తించాలని, ఒకొక్కరికీ రూ.40 వేల నుంచి లక్ష రూపాయల వరకు బ్యాంకుల నుంచి రుణం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.ప్రతి మండలంలో 100 మందిని ఎంపిక చేయాలని సూచించారు. సెర్ప్ ప్రతినిధులు యు.వీరశేఖర్, డి.తేజశ్వరరావు, వెలుగు ఏపీఎం లోపింటి సత్యనారాయణ, ఎఫ్‌పీఓ ఏపీఎం దేవుని నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎం నిర్వాహకుల ఆందోళన


ఎమ్మార్సీ వద్ద ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు

లక్కవరపుకోట: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని(ఎండీఎం) ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి మాపొట్ట కొట్టవద్దని స్థానిక ఎమ్మార్సీ వద్ద ఆపథకం నిర్వాహకులు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేశారు. ఈసందర్భంగా పథకం నిర్వాహకులు మాట్లాడు తూ మెనూ చార్జీలు రూ.20 పెంచాలని, రాజకీయ ఒత్తిళ్లు తగ్గించాలని, పాత బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఎన్నోఏళ్లుగా నామమాత్రపు గౌరవ వేతనంతో సేవలందిస్తున్నామని, కూటమి ప్రభుత్వం పథకాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పేందుకు ప్రయత్నం చేస్తోందని, ఆ ఆలోచనలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈఓ బి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు తరిణి వెంకటరమణ, గాడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మధుపాడలో వైద్యశిబిరం


శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ అనూజ్‌రాయ్

గజపతినగరం: మండలంలోని మధుపాడ గ్రామ సచివాలయంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి అనూజ్‌రాయ్ ఆధ్వర్యంలో గురువారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. 47 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం గృహసందర్శన చేసి బెడ్ రెస్ట్ రోగులకు, వృద్ధులకు వైద్యసేవలందించారు. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించండి


గంగచోళ్లపెంటలో పర్యటిస్తున్న ఎంపీడీఓ కల్యాణి, తదితరులు

గజపతినగరం: ప్రజలు పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ బి.కల్యాణి సూచించారు. గ్రామ సందర్శన కార్య క్రమం లో భాగంగా గంగచోళ్లపెంట గ్రామంలో గురువారం పర్యటించారు.ముందుగా స్థానిక ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో తనిఖీ లు చేశా రు. మధ్యాహ్న భోజనాలను పరిశీలించి, వంట నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలోని వీధి కాలువలు, రోడ్ల ను పరిశీలించారు. నివాస ప్రాంతాల్లో చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలని, వీధికాలువల్లో చెత్త పారబోయ వద్దని గ్రామస్తులకు సూచించారు. ఎంఈఓ–2 సాయిచక్రధర్, స్థానిక సర్పంచ్ బోని సంగమయ్య, ఎంపీటీసీ సభ్యుడు కె.చిన్నపైడన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే గ్రామసందర్శన


జామి: పావడ గ్రామంలో పర్యటిస్తున్న అధికారుల బృందం


దత్తిరాజేరు: గొభ్యాంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

జామి: ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ కార్యాలయ ఏఓ నర్సింహులు తెలిపారు.పావాడలో గురువారం గ్రామసందర్శన నిర్వహించారు. సర్పంచ్ జ్యోతి అధ్యక్షత గ్రామసభ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీక రించారు.అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు నిర్వ హించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించారు. ఈఓపీఆర్డీ జి.ఉమ,ఎంఈఓ జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

గొభ్యాంలో...

దత్తిరాజేరు: మండలంలోని గొభ్యాం గ్రామంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం గ్రామసందర్శన నిర్వహించారు. ముందుగా గ్రామంలో పర్యటించి వీధికాలువలు, వాటర్ ట్యాంకును పరిశీలించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వాటర్ ట్యాంక్ ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు బాగుండడం లేదని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో వెంటనే పంచాయతీ కార్యదర్శిని పిలిచి క్లోరినేషన్ చేయించాలని కాలువల్లో పూడిక తీయించాలని ఎంపీడీఓ ఆదేశించారు. అనంతం పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు.తహసీల్దార్ విజయభాస్కర్, గ్రామీణ నీటి పారుదల శాఖ ఏఈ కార్తీక్, ఈఓపీఆర్డీ వాణిశ్రీ, ఎంఈఓ–2 సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.